

ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్ వద్ద.. నిరుద్యోగ బాధితులు (ఫైల్)

విదేశాల్లో ఉద్యోగం. నెలకు రూ.1.20 లక్షల నుంచి రూ.1.60 లక్షల వరకూ ఆకర్షణీయమైన జీతం. ఓవర్‌టైమ్ చేస్తే అదనంగా వేతనం. బతుకులు బాగుపడతాయి. పైగా పేరుమోసిన కంపెనీ. భద్రతకు పెద్దపీట వేస్తారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కూడా ఉంటుంది. కంపెనీ నుంచి బయటకు వచ్చినప్పుడు ఫైనల్ సెటిల్‌మెంట్ ఉంటుంది.

..ఇవీ ఇచ్ఛాపురంలోని దళారులు దిలీప్, కొచ్చెర్ల ధర్మారెడ్డి.. నిరుద్యోగులకు కల్పించిన ఆశలు. దీనిపై వారు విస్తృత ప్రచారం చేయడంతో జిల్లాతోపాటు ఒడిశా నుంచి కూడా పలువురు నిరుద్యోగులు ఇటీవల ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీసాల కోసం ఒక్కొక్కరూ రూ.లక్షల్లో చెల్లించారు. కానీ నెలల తరబడి ఎదురుచూస్తున్నా.. అదిగో ఇదిగో వీసాలు అంటూ కాలయాపన చేస్తుండడంతో నిరుద్యోగ బాధితులంతా ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఆ దళారులు అందుబాటులో లేకపోవడంతో మోసపోయామని గ్రహించారు. తమకు న్యాయం చేయాలంటూ ప్రజాప్రతినిధులను, పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

లక్షణమైన కొలువన్నారు.. రూ. కోట్లు దోచేశారు

- నిరుద్యోగులకు భ్రమలు కల్పించిన దళారులు
- విదేశాల్లో ఉద్యోగాలిప్పిస్తామంటూ టోకరా
- దాదాపు రూ.6 కోట్లు వసూలు చేసి పరారీ
- ఇచ్ఛాపురంలో వెలుగుచూసిన ఘరానా మోసం
- ప్రజాప్రతినిధులు, పోలీసుల వద్దకు బాధితులు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విదేశీ ఉద్యోగాల పేరిట మరో మోసం ఇచ్ఛాపురంలో వెలుగుచూసింది. ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి గ్రామానికి చెందిన ధర్మారెడ్డి, ఒడిశాకు చెందిన కాయల దిలీప్.. విదేశీ ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు టోకరా వేశారు. విదేశాల్లో పేరున్న కంపెనీల్లో నెలకు సుమారు రూ.1.20లక్షల నుంచి రూ.1.60 లక్షల వరకూ వేతనం వస్తుందని, బతుకులు బాగుపడతాయని నమ్మించారు. ఓవర్‌టైమ్ డ్యూటీ చేస్తే అదనంగా వేతనంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కూడా లభిస్తుందని తెలిపారు. ఈ ఉద్యోగాలకు సంబంధించి ఇచ్ఛాపురంలోని సూర్య లాడ్జిలో ఇంటర్వ్యూలు ఉన్నా యని ప్రచారం చేశారు. టెక్కలి డివిజన్‌లోని అన్ని మండలాల్లో పెద్ద ఎత్తున పోస్టర్లు సైతం అతికించారు. దీంతో కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, పలాస, మందస, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురంతోపాటు ఒడిశాలోని గంజాం, గజపతి జిల్లాల నుంచి (మిగతా 6వ పేజీలో..)

స్థానికంగానే శిక్షణ

ఇచ్ఛాపురంలో బోగస్ సంస్థలు వెలుస్తున్నాయి. స్థానికంగానే అభ్యర్థులకు వెల్డింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. అరకొర శిక్షణ ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. ఒకవేళ విదేశాలకు వెళ్లినా అక్కడ పని ఒత్తిడి తట్టుకోలేక తిరిగి వచ్చిన వారు ఉన్నారు. మరికొందరైతే అక్కడ వాతావరణ పరిస్థితులు అనుకూలించక చాలామంది మృత్యువాత పడుతుంటారు. అక్కడ పరిశ్రమల్లో కనీస భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాల బారిన పడుతుంటారు. చాలామంది చనిపోతుంటారు. మరికొందరు క్షతగాత్రులు గా మిగులుతుంటారు. అటువంటి సమయంలో మృతదేహాలను స్వస్థలాలకు తెప్పించడం కత్తిమీద సాములా మారుతోంది. అక్కడ నిబంధన లు అడ్డంకిగా మారుతాయి. అటువంటి సమయంలో మృత దేహాల కోసం బాధిత కుటుంబ సభ్యులు రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. బోగస్ సంస్థలే ఎక్కువగా మోసాలు చేస్తున్న దృష్ట్యా వాటిపై దృష్టి పెట్టాల్సిన అవసరముంది.

● నిలువునా ముంచేశారు



ఇటలీ, యూరప్‌లోని పరిశ్రమల్లో ఉద్యోగాలు ఉన్నాయంటూ కొద్దినెలల కిందట ఇంటర్వ్యూలు నిర్వహించారు. తాము కూడా అదే కంపెనీలో పనిచేస్తున్నామని దిలీప్, ధర్మారెడ్డి చెప్పారు. పెద్ద ఎత్తున మేన్‌పవర్ అవసరం కావడంతో పరిశ్రమ యాజమాన్యం తమతో ఇంటర్వ్యూలు చేయిస్తోందని.. మంచి జీతంతో బతుకులు మారిపోతాయని నమ్మబలికారు. తీరా డబ్బులు వసూలు చేసి మమ్మల్ని నిలువునా ముంచేశారు.

- దువ్వు వాసు, బాధితుడు, లొద్దపుట్టి

● రూ.2 లక్షలు నష్టపోయాను



ఇటలీలో ఉద్యోగమని చెప్పారు. రూ.1.50 లక్షల వరకూ జీతం వస్తుందని చెప్పారు. కుటుంబ పరిస్థితులు ఏమంత బాగాలేదు. అందుకే ఓ రెండేళ్లపాటు విదేశాల్లో పనిచేస్తే మా కష్టాలు తీరుతాయని భావించాను. అందుకే రూ.2 లక్షలు అప్పు చేసి మరీ కట్టాను. మూడు నెలలుగా వీసా వస్తుందని చెప్పి కాలయాపన చేశారు. దీంతో ఉపాధికి సైతం దూరమయ్యాను. డబ్బులు నష్టపోయాను.

- కె.సంజీవ్, బాధితుడు, ఇచ్ఛాపురం

● మార్పు రావడం లేదు



విదేశీ ఉద్యోగాల పేరిట మోసాలు పెరుగుతున్నా బాధితుల్లో ఎటువంటి మార్పు రావడం లేదు. చాలా బోగస్ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయి. ఇచ్ఛాపురం కేంద్రంగా ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే అవి మంచివా.. బోగస్ సంస్థలా అన్నవి గుర్తించుకొని వెళ్లాలి. అనుమానం వస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి. బాధితుల ఫిర్యాదు మేరకు దిలీప్, ధర్మారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం.

- మీసాల చిన్నంనాయుడు, సీఐ, ఇచ్ఛాపురం

● ప్రభుత్వం చొరవ చూపాలి



విదేశాల ఉద్యోగాల పేరిట నిరుద్యోగులు మోసపోతున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. మోసాలు చేసిన ఏజెంట్లుపై ప్రత్యేక నిఘా పెట్టి పోలీస్ అధికారులు కేసులు నమోదు చేయాలి.

- దాసరి రాజు, జనసేన పార్టీ ఇన్‌చార్జి, ఇచ్ఛాపురం



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

మార్కెటింగ్ శాఖ ద్వారా టమాటా కొనుగోలు

● వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల నుంచి టమాటా పంటను మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతలు స్వీకరించారు. అగ్రిగోల్డ్ సంస్థ ఆర్థిక మోసాల కారణంగా వేలాది కుటుంబాలు ఇబ్బం దులు పడుతు న్నాయని, న్యాయం చేయాలని ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. పంటలు సాగుకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని పలు గ్రామాల రైతులు కోరారు. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బం దులు పడుతున్నామని, తమను ఆదుకోవాలని మరికొంతమంది రైతులు మంత్రికి వినతిపత్రం అందించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

మీ మాటే.. 'కీ'లకం

- పరీక్షల వేళ పిల్లలకు తల్లిదండ్రుల తోడ్పాటు అవసరం
- ఒత్తిడికి గురి చేయవద్దని నిపుణుల సూచన

6లో

డిజిటల్ చదువులు

- బీసీ వసతిగృహాల్లో బోధన
- తొలుత ఐదు హాస్టళ్లలో అమలు
- తరువాత విస్తరణ

6లో

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు

● ఏఎస్పీ రమణ ● 21 కిలోలతో నలుగురి అరెస్టు

8లో

సమయపాలన పాటించాలి

● గ్రూప్-2 అభ్యర్థులకు డీఆర్వో సూచన

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షకు హాజరుకానున్న అభ్యర్థులు సమయపాలన పాటించాలని డీఆర్వో వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. 'జిల్లాలో ఈ నెల 23న నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్ష కోసం 15 కేంద్రాలు(శ్రీకాకుళం మండలంలో - 8, ఎచ్చెర్ల మండలంలో - 7) సిద్ధం చేశాం. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకూ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులు నిర్దేశిత సమయానికి అర గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష కేంద్రాల్లోకి క్యాలిక్యులేటర్, ఫోన్, స్మార్ట్‌వాచ్, బ్లూ టూత్ వంటి పరికరాలు అనుమతించబడవు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తోపాటు పాస్‌పోర్టు/ పాన్‌కార్డు/ ఆధార్ కార్డు/ ఓటరు కార్డు/ డ్రైవింగ్ లైసెన్సు. వీటిలో ఏదో ఒక ఐడీ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి. పరీక్షా కేంద్రాలకు సంబంధించి సందేహాలంటే కలెక్టరేట్‌లోని 08942-240557 నెంబరును సంప్రదించాల'ని డీఆర్వో తెలిపారు.

రిజర్వేషన్లు ప్రకటించాకే పరీక్షలు నిర్వహించాలి

● గ్రూప్-2 అభ్యర్థుల నిరసన

7లో



మందసలో వాసుదేవుడి కల్యాణం

కమనీయం.. కల్యాణం

- పులకించిన భక్త జనం
- కనులపండువగా వాసుదేవుని వివాహ మహోత్సవం
- గోవింద నామస్మరణతో మారుమోగిన మందస

6లో

రిజిస్ట్రేషన్లకూ స్లాట్

- జిల్లాకేంద్రంలో ప్రారంభమైన ప్రక్రియ
- 1 నుంచి అన్ని కార్యాలయాల్లోనూ అమలు
- క్రయవిక్రయదారులకు తప్పనున్న ఇబ్బందులు



నరసన్నపేటలో రిజిస్ట్రేషన్ కోసం క్రయవిక్రయదారుల నిరీక్షణ

నరసన్నపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భూముల క్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం.. రవాణాశాఖలో మాదిరి స్లాట్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం నుంచి ఈ ప్రక్రియ అమలు చేస్తోంది. మార్చి ఒకటో తేదీ నుంచి అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ విధానం అమలు చేయనుంది. దీంతో క్రయవిక్రయదారులకు ఇబ్బందులు తప్పనున్నాయి. జిల్లాలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో రోజుకు 350 వరకు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంతోపాటు టెక్కలి, నరసన్నపేటలో రోజూ 20 నుంచి 60 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు వద్ద క్రయ, విక్రయదారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రస్తుతం వివాహ రిజిస్ట్రేషన్లు, భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయానికే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేరుకున్నా.. ఒక్కోసారి సర్వర్ సమస్య, లేదంటే రద్దీ కారణంగా సాయంత్రానికి కూడా ప్రక్రియ పూర్తయ్యేది కాదు. రాత్రి సమయాల్లో కూడా రిజిస్ట్రేషన్లు జరిగేవి. దీంతో క్రయవిక్రయదారులు, సాక్షులు రోజంతా నిరీక్షించేవారు. రోజంతా ఇతర పనులు పక్కన పెట్టి క్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఈ ఇబ్బందులను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు స్లాట్ విధానం అమలు చేయనుండడంతో క్రయవిక్రయదారుల నిరీక్షణకు తెర పడనుంది. స్లాట్ విధానంతో ఏ సమయానికి రిజిస్ట్రేషన్ చేస్తారో క్రయవిక్రయదారుల సెల్‌ఫోన్‌కు సూక్ష్మ సందేశం వెళ్తుంది. ఆ సమయానికి దస్త్రాలు సిద్ధం చేసుకొని వెళితే గంటలోపే రిజిస్ట్రేషన్ పక్రియ ముగుస్తుంది. వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ఇదే విధానం. ఇంకా ఇతర ప్రక్రియలు కూడా స్లాట్ విధానంలోనే డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. దీంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద బ్రోకర్ల హంగామా తగ్గే అవకాశం కూడా ఉంది.

● స్లాట్ బుకింగ్ ఇలా..

వెబ్‌పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ వివరాలు ఆన్‌లైన్‌లో ఫారంలో పూర్తిచేయాలి. ఆ తర్వాత ఐడీ వస్తుంది. ఆ ఐడీ ఆధారంగా రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించి స్లాట్ బుక్ చేసుకుని ఆ సమయానికి కార్యాలయానికి వెళ్లాలి. లేదా మొబైల్ యాప్ ద్వారా క్రయ విక్రయదారులు వారికి కావాల్సిన సేవలను ఎంపిక చేసుకోవాలి. అప్పుడు క్యూఆర్ కోడ్‌తో ఓ టోకెన్ వస్తుంది. ఆ క్యూఆర్ కోడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చూడా చేరుతుంది. స్లాట్ బుక్ చేసుకోవడానికి ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ స్లాట్ రద్దు చేసుకుంటే మాత్రం రూ.100 చెల్లించాలి. రద్దు చేసుకున్న స్లాట్‌ను మళ్లీ బుక్ చేసుకుంటే రూ.200 ఫీజు చెల్లించాలి. సెలవు రోజుల్లో కూడా స్లాట్ బుక్ చేసుకోవచ్చు.

● ఎనీవేర్ విధానంలో స్లాట్ బుక్ చేసుకోవాలనుకుంటే.. రిజిస్ట్రేషన్ తేదీ ముందురోజు రిజిస్ట్రేషన్ చేయాల్సిన ఆస్తి వివరాలు.. ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఉందో.. ఆ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో దస్త్రాలు పంపించాలి.

ప్రభుత్వ ఆదేశాలు వచ్చాయి..

రిజిస్ట్రేషన్లకు స్లాట్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఈ విధానం అమలవుతోంది. మార్చి ఒకటో తేదీ నుంచి మిగిలిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం అమలు చేయనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు స్లాట్ విధానంలో రిజిస్ట్రేషన్లకు సన్నాహాలు చేస్తున్నాం.

-బసవేశ్వరరావు, సబ్‌రిజిస్ట్రార్, నరసన్నపేట

మీ మాటే కీలకం



- పరీక్షల వేళ తల్లిదండ్రుల తోడ్పాటు అవసరం
- అదే పిల్లలకు ఇంధనం
- వెన్నుతట్టి ప్రోత్సహిస్తే అద్భుత విజయాలు
- ఒత్తిడికి గురి చేయవద్దని నిపుణుల సూచన



పరీక్షల వేళ... విద్యార్థులతో విజయాల తలుపులు తెరిపించే 'కీ'లక పాత్ర తల్లిదండ్రులదేనని నిపుణులు చెబుతున్నారు. ప్రేమ... స్వేచ్ఛతో పాటు సరైన మార్గదర్శకత్వం చేయాల్సిన బాధ్యత వారిపైనే ఉందంటున్నారు. పరీక్షలు రాయడానికి మానసికంగా సంసిద్ధం చేయవలసినది తల్లిదండ్రులేనని సూచిస్తున్నారు.

హరిపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి)

మరికొద్ది రోజుల్లో పది, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. ఇంటర్ విద్యార్థులు మార్చి ఒకటి నుంచి... పదో తరగతి విద్యార్థులు 17 నుంచి పబ్లిక్ పరీక్షలు రాయబోతున్నారు. ఇలాంటి సమయంలో పిల్లలపై ఒత్తిడి అధికంగా ఉంటుంది. పరీక్షలు బాగా రాయడంలో పేరెంటింగ్ (తల్లిదండుల సంరక్షణ) కీలక బాధ్యత వహిస్తుంది. పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ ఎక్కువ సమయం పిల్లలు ఇంటి వద్ద ఉంటారు. కాబట్టి శాస్త్రీయ విధానంతో మంచి ఫలితాలను ఆశించవచ్చని మనోవైజ్ఞానిక నిపుణులు చెబుతున్నారు. చిన్నపాటి జాగ్రత్తలు, సూచనలతో వెన్నుతట్టి ప్రోత్సహిస్తే అద్భుత విజయాలు సాధిస్తారు. ఒత్తిడికి గురిచేయకుండా సానుకూల దృక్పథంతో పరీక్షా నైపుణ్యాలు నేర్పించాలి. పిల్లల పట్ల చూపించే ప్రేమ, అనురాగం.. వారి లక్ష్య సాధనకు దోహదపడతాయి. విజయం వారి వైపు ఉంటుందన్న ధీమా పిల్లలకు కలిగించాలి. జ్ఞాపకశక్తికి నిద్ర చాలా అవసరం. ఈ నేపథ్యంలో రాత్రి వేళ కనీసం 6 గంటలు నిద్రపోయేలా చూడాలి. పరీక్షల సమయంలో బయటి కార్యక్రమాలు వాయిదా వేసుకోండి. ఇంట్లో కుటుంబ సభ్యులు గొడవలు లేకుండా జాగ్రత్త వహించాలి. పరీక్షల సమయంలో సందేహాలు వస్తే సబ్జెక్టు నిపుణులు, ఉపాధ్యాయుల సాయం అందేలా చూడండి. ఒక వేళ పరీక్షను సరిగ్గా రాయలేక పోయినా వెంటనే వారిని కించపరచకండి. ఈ ప్రభావం మిగిలిన వాటిపై పడే అవకాశం ఉంది. ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా పరీక్షలకు సిద్ధమయ్యే వాతావరణాన్ని కల్పించండి. అప్పుడే మీ పిల్లలు విజేతలుగా నిలుస్తారు.

జిల్లాలో ఇలా...

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలల్లో సుమారు 56 వేల మంది పదో తరగతి, సుమారు 79 వేల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. 38 ప్రభుత్వ, 71 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. అలాగే 21 కేజీబీవీ, 9 సోషల్ వెల్ఫేర్, 6 ప్లస్ వన్, ట్రైబల్ వెల్ఫేర్, జ్యోతిరావుపూలే ఒక్కొక్కటి ఉన్నాయి.

ప్రేమ... బాధ్యతలు అవసరం

పిల్లలపై తల్లిదండ్రుల ప్రేమ, శ్రద్ధ, అనురాగం, వారి లక్ష్య సాధనకు.. మంచి మార్కులు రావడానికి.. విజేతలుగా నిలవడానికి ఉపయోగపడతాయి. ఇతరులతో పోల్చి తక్కువగా మాట్లాడకూడదు. పరీక్షలంటే కఠినం అనే భావన ఏర్పడేలా చేయకూడదు. తల్లిదండ్రులు సానుకూల దృక్పథంతో ఉన్నప్పుడే పిల్లల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుంది. పరీక్షల్లో ఎప్పుడూ అడ్డదారులు ఉండవని.. సాధనకు మీరు ఇచ్చే సూచనలు... మద్దతే వారిని ఉత్తమ ఫలితాల సాధకులుగా మార్చనున్నాయి.

నైపుణ్యాలు నేర్పించాలి..

పరీక్షలకు సిద్ధమవుతున్న క్రమంలో ముందుగా విద్యార్థులకు నైపుణ్యాలను నేర్పించాలి. పరీక్షల కోసం చదివితే సరిపోదు. ఎలా రాయాలో నేర్పించాలి. మార్కులు తగ్గడానికి అక్షర దోషాలు కారణం కాకూడదు. కఠినమైన జవాబులు, లెక్కలు, పద్యాలు, నోటితో పదేపదే చదవడం కంటే రాసేలా సాధన చేయించాలి. పరీక్షలు ప్రారంభమైన వెంటనే ఉపాధ్యాయుల పాత్ర ముగిసినట్లు అవుతుంది. ఈ సమయంలో పిల్లలు ఎక్కువ సమయం తల్లిదండ్రుల వద్ద ఉంటారు. దీంతో కచ్చితమైన పునఃశ్చరణ పద్ధతులు పాటించేలా చూడాలి. పరీక్షల సమయంలో పిల్లల శారీరక, మానసిక, ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి. ఇళ్లలో టీవీల వినియోగం, బంధువుల రాకపోకలు తగ్గించాలి. తేలికపాటి ఆహారాన్ని ఇవ్వాలి. పాఠశాలలో చదివిన చదువును మార్కులుగా మలచుకోవాలంటే నమూనా పరీక్షలు రాయించాలి.

ఇంటి వాతావరణం బాగుండాలి..



పరీక్షలు పిల్లల కెరీర్‌ను మలుపు తిప్పేలా వారికి తగినంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఒత్తిడి, భయంతో ఆందోళన చెందకుండా చూడాలి. పాఠ్యాంశాల అభ్యసనంలో ఎంత చురుగ్గా ఉన్నప్పటికీ కొంతమంది పిల్లలు పరీక్షలకు సరిగ్గా సన్నద్ధం కాలేరు. మంచి మార్కుల సాధనకు ఉపాధ్యాయులు అందించే సవరణ బోధన (ఫైనల్ టచ్)కు తల్లిదండుల ప్రోత్సాహం అవసరం. పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యేలా ఇంటి వాతావరణం ఉండాలి. ఉపాధ్యాయులు ఇచ్చిన అభ్యాసాలను పిల్లలు తమకు తాముగా స్వయంగా చేసుకునేలా చూడాలి. పిల్లల శక్తి సామర్థ్యాలను తక్కువగా అంచనా వేయకూడదు. పరీక్షల సమయంలో ఇంటి పనులు, అదనపు పనులు అప్పగించకూడదు. ధైర్యాన్ని కలిగించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

-సీహెచ్ శరత్‌బాబు, అధ్యాపకులు, ప్రభుత్వ కళాశాల, మందస

సానుకూల దృక్పథం అవసరం..



పిల్లలకు పరీక్షల సమయంలో కఠిన నిబంధనలు విధించకూడదు. స్వేచ్ఛాయుత వాతావరణంలో సిద్ధమయ్యేలా చూడాలి. తల్లిదండ్రులు సానుకూల దృక్పథంతో ఉన్నప్పుడే పిల్లల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుంది. కష్టమైన పాఠాలను ఓర్పుగా, నేర్పుగా నేర్చుకునేందుకు సహకరించాలి. ఆహార నియమాలు పాటిస్తు పోషకాహారాన్ని అందించాలి.

-డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సూపరింటెండెంట్, హరిపురం ఆసుపత్రి

ప్రణాళిక అవసరం..



పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించటానికి పునఃశ్చరణ ఒక ముఖ్యమైన భాగం. ఇది ఒక ప్రణాళిక ప్రకారం జరిగేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలి. సందేహ నివృత్తికి సబ్జెక్టు నిపుణుల సలహాలు తీసుకోవాలి. పాఠశాల ప్రణాళికతోపాటు పాత ప్రశ్నపత్రాలు, ప్రభుత్వం విడుదల చేసిన నమూనాలో సాధన చేయిస్తున్నారో లేదో తల్లిదండ్రులు గమనించాలి.

-ఎం.లక్ష్మణరావు, ఎంఈవో, మందస



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

కమనీయం.. కల్యాణం

- పులకించిన భక్త జనం
- కనుల పండువగా వాసుదేవుని వివాహ మహోత్సవం
- గోవింద నామస్మరణతో మార్మోగిన మందస



భక్తుల కోలాటం

హరిపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దేవదేవుడు వాసుదేవుని కల్యాణ మహోత్సవం శుక్రవారం భక్త జనుల గోవింద నామ స్మరణల మధ్య కనుల పండువగా జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో రోజు స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణ వేదికకు చేరుకున్న బ్రహ్మాండ నాయకుని త్రిదండి దేవనాథ్ జీయర్ స్వామి పెళ్లి కొడుకును చేసి... అత్యంత వైభవంగా వివాహ ఘట్టాన్ని నిర్వహించారు. మూలా నక్షత్రంలో మధ్యాహ్నం 12.15 గంటలకు శుభ ముహూర్తాన కల్యాణ వేడుకను జరిపించారు. అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని వివాహ మధుర క్షణంలో వేలాది మంది భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

గరుడ వాహన సేవ..

ఉదయం యాగశాలలో ప్రధాన అర్చకులు గోవిందాచార్యులు, సత్యానంద పాఢి విశేష హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవాసుదేవుని కల్యాణ మహోత్సవం, జీయర్ స్వాముల మంగళా శాసనములు పూర్తి చేశారు. ఆలయ విశిష్టతను.. జీయర్ స్వాములు ఆలయ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. మధ్యాహ్నం కోలాటాలు, పలాస అన్నమయ్య హరి శరణాగతి సమాఖ్య బృందం సంకీర్తనలు, రాజమండ్రికి చెందిన హరిప్రియ కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం గరుడ వాహనంపై భూసమేత వాసుదేవ స్వామి మందస పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

భారీగా భక్తులు..


వాసుదేవుని కల్యాణ మహోత్సవానికి ఉద్దానంతో పాటు ఒడిశా నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం దాతల సహకారంతో ఆలయ సన్నిధిలో రామానుజ యువ సేవా సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని త్రిదండి దేవనాథ్ జీయర్ స్వామి ప్రారంభించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐలు కె. కృష్ణప్రసాద్, నిహార్‌ల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అధ్యక్షులు శనాపతి కిషోర్, మార్కండేయులు, జామి ప్రసాద్, కాళీచరణ్, వైఎస్ఎన్ మూర్తి, ప్రభాకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శనివారం ఉదయం యాగశాలలలో విశేషహోమం, పొన్నవాహన సేవ, శ్రీవెంకటేశ్వర స్వామి పూజలు చేస్తారు. సాయంత్రం తెప్పోత్సవం, అశ్వవాహన సేవ, దోపిడీ ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

డిజిటల్ చదువులు

- బీసీ వసతి గృహాల్లో బోధన
- తొలుత ఐదు హాస్టళ్లలో అమలు
- తరువాత విస్తరణ



బొడ్డపాడు బీసీ హాస్టల్

కాశీబుగ్గ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో డిజిటల్ బోధనకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే ఐదు చోట్ల ఈ దిశగా అడుగులు పడుతున్నాయి. గత ఐదేళ్లుగా ప్రభుత్వ వసతి గృహాలపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగింది. హాస్టళ్ల నిర్వహణను ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో విద్యార్థులకు కష్టాలు తప్పలేదు. అటు హాస్టళ్లలో అడ్మిషన్లు కూడా తగ్గుముఖం పట్టాయి. అందుకే ప్రభుత్వ వసతి గృహాలను గాడిలో పెట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా దీనిపై దృష్టి పెట్టారు. అందులో భాగంగా బీసీ వసతి గృహాల్లో డిజిటల్ బోధన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా ఐదు వసతి గృహాల్లో తొలుత డిజిటల్ విద్యా బోధనను అమలు చేస్తున్నారు. అక్కడ విజయవంతమైతే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని వసతి గృహాల్లో ప్రవేశ పెడతారు.

ప్రయోగాత్మకంగా..

జిల్లాలో 79 బీసీ వసతి గృహాలు ఉన్నాయి. అందులో 7 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ డిజిటల్ బోధన అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా కంచిలి, కోటబొమ్మాళి, నిమ్మాడ, లావేరు, సింగుపురం వసతిగృహాలను ఎంపిక చేశారు. ఎస్ఆర్ శంకరన్ డిజిటల్ రిసోర్స్ కేంద్రాల పేరుతో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. 9, 10 తరగతి విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యం అందించాలనే భావనతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రెండు తరగతుల వారికి ప్రత్యేక డిజిటల్ గదులను ఏర్పాటు చేశారు. ఈ ఐదు వసతి గృహాల్లో రూ.4లక్షల 52వేలతో భారీ ఎల్ఈడీ స్ర్కీన్లతో పాటు ఇతర పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ బోధనకు ట్యూటర్లను నియమించనున్నారు.

ప్రారంభించాం..

జిల్లాలోని ఐదు వసతి గృహాల్లో డిజిటల్ విద్యాబోధన ప్రారంభమైంది. అక్కడ ప్రయోగాత్మకంగా చేపట్టాం. మిగతా వసతిగృహాలకు విస్తరిస్తాం. ఈ వసతి గృహాలకే ప్రభుత్వం సుమారుగా రూ.4 లక్షల 52వేలు ఖర్చు చేసింది. తొలుత రెగ్యులర్ వార్డెన్లు ఉన్న చోట, పిల్లలు ఎక్కువ ఉన్న దగ్గర వీటిని ప్రారంభించాం. వచ్చే ఏడాదికి అన్ని హాస్టళ్లకు విస్తరిస్తాం.

-ఇ.అనూరాధ, బీసీ సంక్షేమ శాఖ అధికారి, శ్రీకాకుళం

గంగ కోసం భగీరథ యత్నం

- రబీ కోసం అన్నదాతల కష్టాలు
- వంశధార కాలువలో గట్లు
- దిగువనున్న రైతులకు ఇబ్బందులు

జలుమూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రబీలో రైతన్నకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఖరీఫ్ వరి పంట కళ్లాలకు చేరుకోగానే రైతులు వంశధార కాలువ కింద రబీ వరి పంట వేశారు. అప్పటికి వంశధార ప్రధాన ఎడమ కాలువలోనూ... చెరువుల్లోనూ... పుష్కలంగా సాగు నీరు ఉండడంతో రబీ వరికి సన్నద్ధమయ్యారు. మండలంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. నారు ఏపుగా పెరిగే దశలో నీటి కొరత రావడంతో సాగునీటి కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. తమ్మయ్యపేట కాలనీ సమీపంలో వంశధార ప్రధాన ఎడమ కాలువ వద్ద 22ఆర్ పిల్ల కాలువలో అడ్డుకట్ట వేయడానికి అష్టకష్టాలు పడ్డారు. ప్రధాన ఎడమ కాలువలో ఎక్కడికక్కడ గట్లు వేసి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటుండడంతో... దిగువ రైతులకు సాగునీరు అందక విలవిల్లాడుతున్నారు. కాలువలకు నీరు విడిచిపెట్టకపోతే తీవ్ర నష్టం జరుగుతుందని వాపోతున్నారు. వంశధార అధికారులు స్పందించి రబీ వరికి సాగునీరు విడిచిపెట్టి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



తమ్మయ్యపేట కాలనీ వద్ద కాలువ మధ్యలో గట్టు వేస్తున్న రైతులు

'లక్ష'ణమైన కొలువన్నారు.. రూ.కోట్లు దోచేశారు

(ఐదో పేజీ తరువాయి)

350 మంది ఇంటర్వ్యూలకు వచ్చారు. యూరఫ్, ఇటలీలో వెల్డర్, ఫిట్టర్, ఫ్యాబ్రికేటర్ వంటి ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. వీసా కోసం ముందుగా డబ్బులు చెల్లించాలన్నారు. ఈ మేరకు నిరుద్యోగులంతా రూ.1.50 లక్షల నుంచి రూ.1.75 లక్షల వరకూ ఒక్కొక్కరూ చెల్లించారు. ఇలా సుమారు రూ.6 కోట్లు వరకూ దళారులు వసూలు చేశారు. కాగా.. ఇంటర్వ్యూలు పూర్తయి మూడు నెలలు గడుస్తున్నా వీసాలు రాలేదు. వెంటనే ముంబైలోని ఇమ్మిగ్రేషన్ కార్యాలయానికి సంప్రదిస్తే యూరఫ్, ఇటలీలో అటువంటి సంస్థలు, పరిశ్రమలు లేవని చెప్పారు. దీంతో దిలీప్, ధర్మారెడ్డి ఇళ్ల వద్దకు బాధితులు వెళ్లారు. వారు ఇళ్లకు తాళాలు వేసి కనిపించగా.. ఫోన్ చేసినా అందుబాటులో లేకపోవడంతో మోసపోయామని గ్రహించారు. ఆయా మండలాల్లో పోలీసులను ఆశ్రయించి.. తమకు న్యాయం చేయాలంటూ బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. నిరుద్యోగ బాధితుల సమస్యను జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు.. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితులకు అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డితో విప్ అశోక్ ఫోన్‌లో మాట్లాడి.. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు దీనిపై ఎస్పీ ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది.

● అంతటా దళారుల హవా..

జిల్లాలో విదేశీ ఉద్యోగాల పేరుతో ఎక్కువగా మోసాలు వెలుగుచూస్తున్నాయి. ఇంటర్వ్యూల సమయంలో చెప్పింది ఒకటి. అక్కడకు వెళ్లిన తరువాత పనులు మరొకటి అన్నట్టు ఉంది పరిస్థితి. దళారుల ద్వారా వెళుతున్న వారే ఎక్కువగా మోసాలబారిన పడుతున్నారు. దళారులు గ్రామాల్లోకి సైతం వచ్చి ఆకర్షణీయమైన జీతం అంటూ నిరుద్యోగ యువతను నమ్మిస్తున్నారు. అధిక మొత్తంలో డబ్బులు గుంజుకొని మోసాలకు పాల్పడు తున్నారు. ప్రధానంగా ఇచ్ఛాపురం కేంద్రంగా విదేశీ ఉద్యోగాల ఇంటర్వ్యూలు చేస్తుంటారు. జిల్లాలో టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నిరుద్యోగ యువత ఎక్కువగా విదేశాలకు వెళుతుంటారు. భవన నిర్మాణంతో పాటు పరిశ్రమల్లో కార్మికులుగా పనిచేస్తుంటారు. పదో తరగతి వరకూ చదవడం.. వెల్డర్, ఫిట్టర్, ఫ్యాబ్రికేటర్‌గా శిక్షణ తీసుకోవడం.. తరువాత ఉపాధి బాట పట్టడం ఉద్దానంలో పరిపాటిగా మారింది. అయితే గతం మాదిరిగా విదేశాల్లో ఉద్యోగాలు ఆశాజనకంగా లేవు. మేన్ పవర్ సొసైటీలు రంగంలోకి దిగి సొమ్ము చేసుకుంటున్నాయి. అభ్యర్థులను పంపించి వారిపై కమీషన్లను దండుకుంటున్నాయి. గతంలో నైపుణ్యం చూసి.. సదరు కంపెనీలు తమకు విదేశాల్లో ఉండే పరిశ్రమలకు పంపించేవి. విమాన టిక్కెట్లతో పాటు వీసా, వసతి వంటివి సమకూర్చేవి. దీంతో విదేశాల్లో పనిచేయడం లాభసాటిగా ఉండేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అంతటా బ్రోకర్ వ్యవస్థ నడుస్తోంది. మేన్ పవర్ ఏజెన్సీల నిర్వాహకులు శిక్షణ సంస్థల మాటున విదేశీ పరిశ్రమల్లో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఇలా ఎంపిక చేసినందుకు కమీషన్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎక్కువగా బోగస్ కంపెనీల పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

బంగారం భయపెడుతోంది

- వెండిదీ అదే దారి
- రూ.లక్ష మార్కు దాటిన వైనం



నరసన్నపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బంగారం, వెండి ధరలు నువ్వా? నేనా? అన్నట్టుగా పోటీ పడుతున్నాయి. ఆల్‌టైం రికార్డు స్థాయికి చేరుకున్నాయి. బులియన్ మార్కెట్‌లో వెండి, బంగా రం ధరలు పోటాపోటీగా పరుగులు పెడుతున్నాయి. వెండి కిలో ధర రూ.లక్షకు చేరి.. బంగారం సరసన నిలిచింది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన వెండి ధర కిలో రూ.88,400 ఉండగా... కేవలం 50 రోజుల్లోనే కేజీపై రూ.11వేల 600 వరకూ పెరిగి... శుక్రవారానికి రూ.లక్షకు చేరుకుంది. బంగారం ధర గత నెలలో 10 గ్రాములు రూ.80వేలకు చేరింది. జనవరి నుంచి ఈ ధరలు పెరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి పెరుగుతూ 10 గ్రాముల ధర శుక్రవారం నాటికి రూ.88,040కి చేరింది. తులం ధర రూ.లక్షా 3వేలకు చేరుకుంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారు ఆభరణాల ధర రూ.80,700కు చేరుకుంది. ఈ ధరలు ఇలా విపరీతంగా పెరిగిపోవడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. మున్ముందు కొనగలమో..లేదోనని సామాన్యులు భయపడుతున్నారు. ఇప్పటికే ఎక్కువగా కొనుగోలు చేసుకున్న మదుపరులు మాత్రం కొంతవరకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


జి.సిగడాం: మహనీయుల వేషధారణలో అధ్వాన్నంపేట పాఠశాల విద్యార్థులు


నరసన్నపేట: సత్యవరం ఉన్నత పాఠశాలలో మాతృభాష గొప్పతనం ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా మాతృభాషా దినోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో తెలుగు రచయిత వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెరవే ప్రధాన కార్యదర్శి ఆర్వీ రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు భాష విశిష్టతను పలువురు వక్తలు వివరించారు. ఈ సందర్భంగా రిటైర్డు డీఈవో బలివాడ మల్లేశ్వరరావ, సెట్‌శ్రీ రిటైర్డు సీఈవో సురంగి మోహనరావు మాతృభాషలోని మాధుర్యాన్ని వివరించారు. సాహితీ వేత్తలు, పలువురు కవులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో మాతృభాషా దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.


ఇచ్ఛాపురం: అక్షరమాలతో తయారు చేసిన బొమ్మలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు


పాతపట్నం: తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థినులు

ఇబ్బంది లేకుండా ఫ్లైఓవర్ నిర్మిస్తాం

● హైవే డిప్యూటీ మేనేజర్ సతీష్

రణస్థలం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గతంలో సేకరించిన స్థలంలోనే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రణస్థలంలో ఓపెన్ ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతుందని జాతీయ రహదారుల విభాగం సంస్థ (హైవే) డిప్యూటీ మేనేజర్ సతీష్ తెలిపారు. ఫ్లై ఓవర్ నిర్మాణంపై ప్రజల అభ్యంతరాలను ఇప్పటికే పలుసార్లు 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫ్లై ఓవర్ వ్యతిరేక పోరాట కమిటీ, పోలీసు, రెవెన్యూ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ రణస్థలం వద్ద బైపాస్ నిర్మాణానికి అవకాశం లేదన్నారు. మాజీ ఎంపీపీ డీజీఎం ఆనందరావు, సర్పంచ్ బవిరి రమణ, మాజీ ఎంపీటీసీ తిరుపతి రాజు, పిన్నింటి సత్యంనాయుడు, అల్లు యుగంధర్, పి.సాయిరాం, కరిమజ్జి మల్లేశ్వరరావు మాట్లాడుతూ.. రణస్థలంలో ఫ్లై ఓవర్ నిర్మాణంతో ఉన్న ఇబ్బందుల దృష్ట్యా దీనిని విరమించుకోవాలన్నారు. బైపాస్ నిర్మాణం వల్ల ఎంతో ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. దీనిపై అధికారులకు, స్థానికుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. చివరకు ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు చేపడతామని అధికారులు స్పష్టంచేశారు. రణస్థలం మండల కేంద్రంలో 800 మీటర్ల పొడవున ఓపెన్ ఫ్లై ఓవర్ ఉంటుందని, జంక్షన్‌లో ముందు, తర్వాత 60 మీటర్ల వెడల్పు, మిగతా ప్రాంతంలో 45 మీటర్ల వెడల్పుతో రోడ్డు ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఉన్న సర్వీసు రోడ్డుకు ఇరువైపులా పది మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. అయితే ఈ రోడ్డు వల్ల స్థానికులకు ఇబ్బంది కలుగుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. తహసీల్దార్ ప్రసాదరావు, డిప్యూటీ తహసీల్దార్ నారాయణమూర్తి, సర్వేయర్ రవి కుమార్, సీఐ అవతారం, ఎస్ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హైవే డిప్యూటీ మేనేజర్ సతీష్

నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ఆమదాలవలస, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఈ నెల 22న శనివారం 'ఎమ్మెల్యే ప్రజాదర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించినట్టు టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల డిల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు మేరకు ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న ప్రజాదర్బార్‌లో నియోజకవర్గ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందించాలని వారు కోరారు.

ఇచ్ఛాపురం పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పట్టణంలో నిత్యమూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీనిపై స్పందించిన సీఐ మీసాల చిన్నమనాయుడు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు భారీ వాహనాలకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా బాహుదా వంతెన పై నుంచి భారీ వాహనాల రాకను పూర్తిగా నిషేధించామని తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షలు పాటించకుంటే కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడిగా భువనేశ్వరరావు

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది, మాజీ ఏపీపీ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావును ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల టీడీపీ పరిశీలకుడి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ తరఫున భీమిలి నియోజకవరంలో పర్యవేక్షించనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నిక జరిగే వరకు ప్రచారం, సమన్వయపర్చడానికి గాను ఈయనను పార్టీ నియమించింది. నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాను ప్రగతిపథంలో నడిపిద్దాం

అరసవల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, జిల్లాను ప్రగతిపథంలో నడిపిద్దామని జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా ఆధ్వర్యంలో జడ్పీ సమావేశ మందిరంలో 2, 4, 7 స్థాయీ సంఘ సమావేశాలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పారిశుధ్యం రహదారులు భవనాలు, విద్యుత్తు, నీటిపారుదల శాఖ, జిల్లా గ్రామీణ నీటి యాజమన్య సంస్థ, పంచాయతీ, గృహనిర్మాణ సంస్థ, వైద్యారోగ్యశాఖ తదితర శాఖల వారీగా సమీక్షలు నిర్వహిం పలు సూచనలు చేశారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాన్ని మనమే కాపాడుకుందాం

సోంపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మన తీర ప్రాంతాన్ని మనమే కాపాడుకోవాలని మైరైన్ సీఐ డీవీజే రమేష్ అన్నారు. శుక్రవారం బారువ సముద్రతీర ప్రాంతంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థాల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. సీఐ ఆధ్వర్యంలో సుమారు 200మందితో కలిసి బీచ్ ప్రాంతంలో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐలు శ్రీనివాసరావు, శిరీష, ఏఎస్ఐలు కోదండరావు, మాధవరావు, శాంతమూర్తి, సురేష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన


కమిటీ సభ్యులతో చర్చిస్తున్న పోలీసులు

పొందూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): లక్షలాదిమంది భక్తులు దర్శించుకునే దళ్లవలస రాజమ్మతల్లి జాతర ఏర్పాట్లను ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ శుక్ర వారం పరిశీలించారు. శనివారం, ఆదివారాల్లో ఈ జాతర జరుగుతుంది. ప్రతీ రెండేళ్లకోసారి పెద్ద ఎత్తున రాజమ్మతల్లి జాతర నిర్వహిస్తారు. జిల్లా నలుమూలలు నుంచే కాకుండా విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి, ఒడిశా రాష్ట్రం నుంచి లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తారు. ముఖ్యంగా ఆదివారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తనున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి గొడవలు, ఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో అధికారులు చర్చించారు.

ఉన్నత స్థానాలు అధిరోహించాలి


మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవల్లిక

బూర్జ, ఫి బ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠ శాలలో శుక్రవారం పదో తరగతి, 12వ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీసీవో బాలాజీ పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ఎస్ఐ ప్రవల్లిక మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ దేవేందర్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, పూర్వ ప్రిన్సిపాల్ రామకృష్ణ, దుప్పలవలస స్కూల్ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలు సరికాదు



నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకులపై ప్రభుత్వం చేపడుతున్న విధానాలు సరికాదని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ కన్వీనర్ బి.శ్రీనివాసులు అన్నారు. యూనియన్ పిలుపు మేరకు కళింగరోడ్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయం వద్ద ఉద్యోగులు, అధికారులు శుక్రవారం సాయంత్రం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. అలాగే ఐదు రోజుల పని దినాలను వెంటనే అమలు చేయాలని, బ్యాంక్ అధికారులు, ఉద్యోగులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం స్పందించిన అడ్డుకోవాలని కోరారు. రీజనల్ కార్యదర్శి కె.తేజేశ్వరరావు, కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు గిరిధర్ నాయక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల సం ఉపాధ్యక్షురాలు జి.కరుణ, నాయకులు సూర్య, కిరణ్, నరేష్, శ్రీనివాస్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న ట్రాఫిక్ సిగ్నల్స్


డే అండ్ నైట్ కూడలిలో వెలగని సిగ్నల్ లైట్స్

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నగరంలోని వివిధ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. వీటిలో ప్రధానమైన డే అండ్ నైట్ కూడలిలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు గడచిన రెండు రోజులుగా మొరాయిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు సిగ్నల్స్ వెలగకపోవడంతో వాహనదారులు తమ ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. గడిచిన రెండు రోజులుగా ఇలాగే ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తక్షణమే సిగ్నల్ లైట్లను పునరుద్ధరించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

హాకీ క్రీడాకారుల ఎంపిక రేపు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని పాత్రునివలస వద్ద గల క్రీడా మైదానంలో ఈ నెల 23వ తేదీన జిల్లాస్థాయి సీనియర్ పురుషుల హాకీ ఎంపికలు జరుగుతాయని సంఘ జిల్లా అధ్యక్షుడు పంచిరెడ్డి అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి జరుగుళ్ల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 1991 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. హాజరైన క్రీడాకారులు జనన ధ్రువ పత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్‌తోపాటు హాకీ కిట్‌తో హాజరు కావాలన్నారు. ఇందులో ఎంపికైన వారు వచ్చే నెల 6, 7, 8వ తేదీల్లో గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

కనీస వేతనం పొందండి

గార, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) ఉపాధి పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో వేతనదారులు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేస్తూ కనీస వేతనం రూ.300 పొందాలని ఏపీవో సీహెచ్ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం కొర్ని గ్రామంలో ఉపాధి పథకం వేతనదారులకు ఆమె అవగాహన కల్పించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం రోజూ ఎనిమిది గంటలు పనిచేసి కనీస వేతనం పొందాలన్నారు. అలాగే పంట నీట కుంటలు గురించి అవగాహన కల్పించారు. టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): దవలపేట మాజీ సర్పంచ్ కంచరాన సూరన్నాయుడును శుక్రవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) పరామర్శించారు. సూరన్నాయుడు మాతృమూర్తి అమ్మాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎన్ఈఆర్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఆనందపురం గ్రామంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం ఇంట్లో నిర్వహించిన దైవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రఘువర్మను గెలిపించాలి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న గోవిందరావు

ఆమదాలవలస, ఫిబ్ర వరి 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పాకలపాటి రఘువర్మను గెలిపించాలని ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల టీడీపీ పరిశీలకులు, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గంద్రేతు గోవిందరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధి లక్ష్మీనగర్ స్కూల్‌లో ఉపాధ్యాయులను కలిసి కూటమి ప్రభుత్వం తరఫున రఘు వర్మకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ఫారం పాండ్స్‌ను పూర్తిస్థాయిలో నిర్మించండి

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఫారం పాండ్స్‌ను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ బి.సుధాకర్ అన్నారు. చిలకపాలెంలో ఫారం పాండ్స్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఫారం పాండ్స్ అవుట్ లెట్, ఇన్ లెట్ పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో శోభాదేవి, ఈసీ నారాయణమ్మ, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అజ్జరాంలో ఉమా రామలింగేశ్వర పంచాయతన సహిత దేవాలయాల ప్రారంభం, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సత్యనారాయణ, షిర్డీసాయి, దత్తాత్రేయ, సుబ్రహ్మణ్య, కాలభైరవ, నవగ్రహ ఆలయాలను గ్రామస్థులు, దాతల సహకారంతో నిర్మించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోర శ్రీనివాసరావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు బోర సాయిరాం పాల్గొన్నారు.

రిజర్వేషన్లు ప్రకటించాకే పరీక్షలు నిర్వహించాలి

● గ్రూప్-2 అభ్యర్థుల నిరసన


నిరసన తెలుపుతున్న గ్రూప్-2 అభ్యర్థులు

అరసవల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పాత పద్ధతిలో కాకుండా జీవో.77 ప్రకారం కొత్త విధానంలో గ్రూప్-2 రిజర్వేషన్స్ ప్రకటించాకే పరీక్షలు నిర్వహించాలని పలువురు అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రోస్టర్ క్లియర్ చేయకుండా గ్రూప్-2 మెయిన్స్ నిర్వహిస్తే సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని, నోటిఫికేషన్ రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు. అందుకే రోస్టర్ క్లియర్ చేశాకే పరీక్షలు నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నో ఏళ్లుగా ఏ ఉద్యోగం లేకుండా కష్టపడి చదువుతూ నిరుద్యోగంతో గడిపామని, ఇప్పుడు పరీక్షలను నిర్వహిస్తే, అవి రద్దయితే తాము అన్యాయమైపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రూప్-2 అభ్యర్థులు పి.నవీన్, జి.సునీంద్ర, టి.జగదీష్, ఎం.అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రం మంజూరుపై హర్షం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రం మంజూరుపై టీడీపీ నాయకులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బాలికోన్నత పాఠశాల ఎగ్జామినేషన్ సెంటర్‌గా మంజూరు కావడానికి కృషి చేసిన ప్రభుత్వ విప్, నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డితో పాటు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.







క్రైం కార్నర్

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు

● ఏఎస్పీ రమణ ● 21 కిలోలతో నలుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రమణ

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోందని ఏఎస్పీ కేవీ రమణ అన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గంజాయితో పట్టుబడిన వారి వివరాలను శుక్రవారం విలేకరులకు వివరించారు. రూరల్ మండలం సింగుపురం గ్రామంలో ఉన్న హాటకేశ్వర స్వామి ఆలయం సమీపంలోని కొండ దిగువన నలుగురు వ్యక్తులు గంజాయిని పంచుకుంటున్నట్టు వచ్చిన సమాచారం మేరకు శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ కె.రాము తన సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారన్నారు.

పట్టుబడింది పాత నేరస్థులే..

ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పట్టుబడిన వారిలో దమ్మలవీధికి చెందిన చీకటి యోగేశ్వరరావు అలియాస్ అవతార్, పెద్ద రెల్లివీధికి చెందిన జలగడుగుల తార వికాస్ గతంలో గంజాయి రవాణా కేసుల్లో వన్‌టౌన్ స్టేషన్‌లో పాత నేరస్థులు. అలాగే 12 దొంగతనం కేసుల్లో నిందితులైన పాత్రునివలసకు చెందిన ధర్మాన ప్రవీణ్‌కుమార్, బైరివానిపేటకు చెందిన బగ్గు నవీన్ గంజాయి రవాణా చేసేందుకు సిద్ధమయ్యారు. మిగిలిన వారిపై పోలీసుల నిఘా ఉంటుందని భావించి బగ్గు నవీన్‌కు తలో రూ.30వేలు చొప్పున రూ.1.20 లక్షలు ఇచ్చి గంజాయి తెచ్చేందుకు పర్లాకిమిడి పంపించారు. దీంతో నవీన్ పర్లాకిమిడిలో ఉన్న తన చెల్లెలి ఇంటికి ఈనెల 17న వెళ్లాడు. అక్కడ ఓ సాధువు దగ్గర కిలో గంజాయి రూ.5 వేలు చొప్పున 21 కిలోలు కొనుగోలు చేసి రెండు రోజులు అక్కడే ఉండి, 20వ తేదీన ఒక గోనె సంచిలో వేసుకుని తెచ్చి సింగుపురం సమీపంలోని హాటకేశ్వరస్వామి ఆలయం దగ్గర కొండ దిగువన దాచిపెట్టాడు. ఈ విషయాన్ని మిగిలిన వారికి చెప్పడంతో శుక్రవారం వారంతా అక్కడకు చేరుకుని వాటాలు వేసుకునేందుకు సిద్ధమయ్యారు. అప్పటికే రూరల్ పోలీసులకు ఈ విషయం సమాచారం ఉండడంతో సీఐ కె.పైడపునాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ కె.రాము తన సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని పట్టుకుని, వారి నుంచి 21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు. అయితే ఈ కేసులో పట్టుబడిన జలగడుగుల తార వికాస్ పాత గంజాయి కేసులో శిక్ష అనుభవించి కొద్ది రోజుల కిందటే బయటకు వచ్చినట్టు ఏఎస్పీ తెలిపారు.

గంజాయితో పట్టుబడితే ప్రత్యేక షీట్

గంజాయితో పట్టుబడితే ప్రత్యేక షీట్‌లు తెరుస్తామని ఏఎస్పీ రమణ స్పష్టం చేశారు. గడిచిన కొన్నేళ్లుగా సరైన చర్యలు లేకపోవడంతో జిల్లాను గంజాయి వనంగా మార్చేశారన్నారు. ఒడిశా రాష్ట్రం జిల్లాకు సరిహద్దు కావడంతో విచ్చలవిడిగా గంజాయి రవాణా జరుగుతోందని, దీంతో యువత మత్తుకు బానిసలవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం గంజాయి నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గడిచిన ఆరు నెలల్లో 55 కేసుల్లో 1,725 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, సుమారు 20 వాహనాలు సీజ్ చేసి 114 మందిని అరెస్టు చేశామన్నారు. 33 మందిని రీహేబిటేషన్ సెంటర్‌కు పంపించామని వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి వివరాలు తెలిసిన వారు 100, 112 టోల్‌ఫ్రీ నెంబరుకు తెలపాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కాగా పాత నిందితులపై నిఘా ఉంచి గంజాయిని పట్టు కోవడంలో ప్రత్యేక చొరవ చూపిన డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ కె.పైడపునాయుడు, ఎస్ఐ కె.రాము, ఏఎస్ఐ డిల్లీశ్వరరావు, హెచ్‌సీలు కృష్ణ మూర్తి, ఎస్కే సాన్వాజ్, కానిస్టేబుళ్లు వరదరాజులు, వాసుదేవరావు, రాంబా బులను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

వదినపై మరిది దాడి

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వదినపై మరిది దాడి చేసిన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొన్నాడ గ్రామానికి చెందిన షైలపల్లి శేషగిరిరావు మద్యం మత్తులో తన అన్న శ్రీరామ్మూర్తి భార్య రాజేశ్వరిపై గురువారం సాయంత్రం దాడి చేశాడు. ఈ ఘట నలో గాయపడిన ఆమె ప్రస్తుతం శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందు తోంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎచ్చెర్ల పోలీసులు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు


వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే వారంతా నిబంధనలు పాటిం చాలని, ఉల్లంఘిస్తే అపరాధ రుసుం వేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆమదాలవలస సీఐ సత్యనారాయణ స్పష్టం చేశారు. లక్ష్మీనర్సుపేట జంక్షన్‌లో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. సీ బుక్, ఇన్స్యూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధాన రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నందున వాటి నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణించినా, అతి వేగంతో వాహనాలు నడిపినా, మైనర్లు డ్రైవింగ్ చేసినా చర్యలు తప్పవన్నారు. ఆయనతోపాటు సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి, సిబ్బంది పాల్గొన్నారు.

అడవి పందుల నుంచి రక్షణకు..


బెండి గ్రామంలో పంట పొలంలో చీరలు కట్టిన దృశ్యం

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పొలాల్లోని అంతర పంటల చుట్టూ ఇలా చీరలు కట్టి అడవి పందుల నుంచి రక్షించుకుంటున్నారు రైతులు. మండలపరిధిలోని పెద్దబొడ్డపాడు, బెండి, వజ్రపు కొత్తూరు, కిడిసింగి పంచాయతీల్లో రాత్రి వేళల్లో అడవి పందులు సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో కొందరు రైతులు రాత్రి సమయాల్లో పొలాల్లో కాపలాలు ఉంటుండగా మరికొందరు ఇలా చీరలను కట్టి పంటల రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. పంట చుట్టూ చీరలు కట్టడం వల్ల అడవి పందులు భయపడి రావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఈ పద్ధతి వల్ల ప్రయోజనం కనిపిస్తుండడంతో రైతులు దీనిపై ఆసక్తి కనబరుస్తున్నారు.

కొనుగోలుదారులకు కూర‘గాయాలు’

● తగ్గుముఖం పట్టని ధరలు
● రైతుబజార్ లేకపోవడం ఓ కారణం

పలాస, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్‌లో ధరలతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో కూరగాయల ధరలు కొంచెం తక్కువగా ఉంటాయి. అయితే ఈ ఏడాది మాత్రం గడచిన నాలుగు నెలల నుంచి రోజు రోజుకు ధరలు పెరుగుతున్నాయి తప్ప తగ్గకపోవడంతో సామాన్యులు ఇక్కట్లకు గురవుతున్నారు. కూరగాయల పంటలు రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ఇదే సమయంలో దళారులు మాత్రం జేబులు నింపుకుంటున్నారు. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో రైతుబజారు లేకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా అవుతోంది. ధరలను తమకు అనుకూలంగా పెంచుకుపోతూ కొనుగోలుదారులను దోచుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శుక్రవారం వారపు సంత రోజు మాత్రం ఇతర ప్రాంతాల నుంచి కూరగాయల వ్యాపారులు, రైతులు మార్కెట్‌లో సరకులు విక్రయిస్తుండడంతో కాస్త తగ్గుముఖం పట్టినా ఆ తరువాత మాత్రం యథావిధిగా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యుడికి అందుబాటులో లేని ధరలు బహిరంగ మార్కెట్‌లో ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పలాస ప్రాంతంలో మునగ, ఆనప కాయలు, పందిరి చిక్కుడు, హరి శ్చంద్రకాయలు (బరబాటి), అరటి, సారకంద, ముల్లంగి, తోటకూర, వంకాయలు ఎక్కువగా పండిస్తారు. మిగిలిన కూరగాయలన్నీ దిగుమతి చేసుకోవడం వల్ల విపరీతమైన రేట్లకు విక్రయిస్తుంటారు. అయితే ఈ సీజన్‌లో అన్ని కూరగాయలు ఎక్కువగా పండుతున్నా వ్యాపారుల సిండికేట్ కారణంగా ధరలు మాత్రం అందుబాటులో లేవని పలువురు కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి కూరగాయల ధరలను నియంత్రించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



కాయగూరలు	కేజీ ధర రూ.
వంకాయలు	40
బరబాటి	50
పందిరి చిక్కుడు	50
అరటికాయలు(జత)	20
బీన్స్	50
దొండకాయలు	40
కోలీపువ్వు	40
కోబి బుట్ట	40
క్యారెట్	60
బీరకాయలు	80
మట్టర్(పచ్చిబఠాని)	60
మునగకాయలు	100
ముల్లంగి(3దుంపలు)	20

ధరలకు కళ్లెం వేయాలి



పంటలు పండే సమయంలో కూడా ధరలు ఎక్కువగా ఉండడం దారుణం. సిండికేట్ వ్యాపారాలు వల్లే ఇటువంటి పరిస్థితి. రైతుబజార్ ఏర్పాటు చేసి ధరలను నియంత్రించాలి. అధికారులు స్పందించి నిరంతర నిఘా ఏర్పాటు చేసి ధరలను అదుపుచేయాలి.

ఎ.రామకృష్ణ, అంబుసోలి

అన్ని కాలాల్లోను ఒకటే రేటా?



సామాన్యుడికి అందుబాటులో ధరలు ఉండాలి. వేసవిలో కూరగాయల ధరలు పెరగడం సాధారణం. కాని ఇప్పుడు అన్ని కాలాల్లో ఒకే ధర ఉండడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ధరల అదుపునకు చర్యలు తీసుకోవాలి.

ఎ.సాంబమూర్తి, తాళభద్ర

కళాశాల అభివృద్ధికి సహకరించాలి

● డీఈవో తిరుమల చైతన్య
● వేడుకగా జూనియర్ కళాశాల స్వర్ణోత్సవం


మాట్లాడుతున్న డీఈవో తిరమల చైతన్య


నృత్యాభినయం చేస్తున్న విద్యార్థినులు

కొత్తూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కళాశాల స్వర్ణోత్సవం నిర్వహించడం ఆనందంగా ఉందని, సంస్థ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని డీఈవో తిరుమల చైతన్య అన్నారు. కొత్తూరు జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ.. ధనంతో ఎవరినైనా కొనవచ్చని, కాని సరస్వతీ దేవిని కొనలేరన్నారు. కళాశాల ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిందని, ఈ కళాశాలలో చదివి ఎందరో ఉన్నత స్థాయిల్లో ఉన్నారని, వారంతా కళాశాల అభివృద్ధికి కృషి చేసి రుణం తీర్చుకోవాలన్నారు. పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలియడం అదృష్టంగా భావించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ చదువులు సాగించిన విద్యార్థులందరూ కలిసి ఆప్యాయంగా పలుకరించుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఆనందంగా ఉండడంతో అక్కడ అంతా పండగ వాతావరణం కనిపించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బండారు రవికుమార్, కొత్తూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం గోవిందరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎద్దు దాసు నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

నరసన్నపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నందున ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ప్రతిభ కనబరచాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పవన్ అన్నారు. శుక్రవారం కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ వి.నారాయణస్వామి, పైడి వెంకటరావు, సువ్వారి శ్రీనివాసరావు, లక్ష్మి, తారక్ తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని వృథా చేయొద్దు


విద్యార్థినుల డ్యాన్స్ ప్రదర్శన

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు సమ యాన్ని వృథా చేయకుండా సంసిద్ధం కావాలని గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్ పట్నాయక్ అన్నారు. కళాశాలలో శుక్రవారం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళితే అత్యధిక మార్కులు సంపాదించవచ్చన్నారు. అనంతరం అధ్యాపకు లను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎంలు సీతరాజు, చంద్రశేఖర్, తిరుపతిరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

లక్ష్యాల దిశగా నడిపించేది విద్య


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

పాతపట్నం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): లక్ష్యాల దిశగా నడిపించేది విద్య అని, ప్రాథమిక స్థాయి నుంచి దీనిపై శ్రద్ధ వహించాలని వక్తలు అన్నారు. స్థానిక విజ్ఞాన్ స్కూల్‌లో శుక్రవారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ ఎం.గంగాధర్ మాట్లాడుతూ.. అభిరుచికి తగిన లక్ష్యాలను నిర్దేశించు కోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు చేసిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా కళాశాల వార్షికోత్సవం

కంచిలి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం, ఫేర్‌వెల్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గతేడాది కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సిరివెన్నెల, సరిత, మీనాక్షిలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.జగదీష్‌కుమార్, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సీత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు

పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేయండి

జలుమూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కాలనీ ఇళ్ల నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని హౌసింగ్ ఇన్‌చార్జి ఈఈ కె.అప్పారావు కోరారు. ఈ మేరకు తహసీలార్ జె.రామారావును శుక్రవారం కలిసి చర్చించారు. జిల్లాలో ఇళ్ల కాలనీల కోసం 37,756 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో గ్రామీణ ప్రాంతాల నుంచి 36,562, అర్బన్ నుంచి 1194 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఈ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బావుల వద్ద క్లోరినేషన్ చేయాలి


పారిశుధ్య సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ రామారావు

పలాస, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని తాగునీటి బావుల వద్ద క్లోరినేషన్ చేసి ఆరోగ్యకర వాతావరణం కల్పించాలని కమిషనర్ ఎన్.రామారావు ఆదేశించారు. శుక్రవారం ఆయన 18, 24, 28, 30 వార్డుల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ, తాగునీటి బోర్లను పరిశీలించారు. బోర్ల వద్ద పారిశుధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. రోడ్లపై ఎక్కడ చెత్త కనిపించినా తక్షణం దానికి తరలించే చర్యలు తీసు కోవాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. జూనియర్ కళాశాల గోడకు ఆనుకొని ఉన్న అనధికార కట్టడాలను గుర్తించామని, తగు చర్యలు తీసుకుంటామన్నారు.

టమాటా రైతులకు అండగా ప్రభుత్వం

నరసన్నపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): టమాటా పండించే రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం పోలాకి వద్ద సాగు చేస్తున్న టమాటా పంట పొలాలను పరిశీలించి రైతు ఎల్లయ్యతో మాట్లాడి భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే బగ్గు


ప్రైవేటు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట/పోలాకి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం కత్తిరివానిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రైవేటు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కె.వెంకటేష్, డొంకాడ రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చీపురుపల్లి పార్టీ పరిశీలకుడిగా ‘పుచ్చ’..


ఈశ్వరరావును ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కళా

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా పుచ్చ ఈశ్వరరావును టీడీపీ అధిష్ఠానం నియమించింది. ఈమేరకు శుక్రవారం చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కూటమి మద్దతుతో పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేత కర్ని రమణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పరిశోధనలపై దృష్టి సారించాలి

● జేఎన్‌టీయూ(జీవీ) డైరెక్టర్ స్వామినాయుడు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ స్వామినాయుడు

టెక్కలి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు పీజీ, పీహెచ్‌డీ విభాగాల్లో నాణ్యమైన పరిశోధనలపై దృష్టి సారించాలని జేఎన్‌టీయూ (జీవీ) ఆరెన్డీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు అన్నారు. శుక్రవారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఆరెన్డీ సెల్ ఆధ్వర్యంలో పరిశోధకుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024-25 విద్యా సంవత్సరంలో ఐతమ్ రీసెర్చ్ విభాగం ద్వారా పీహెచ్‌డీ చేయుటకు 31 మంది జాయిన్ కావడం హర్షణీయమన్నారు. జర్మనీ డ్రెస్‌డెన్ టెక్నాలజీ యూనివర్సిటీ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్‌కుమార్ శర్మ మాట్లాడుతూ.. పీహెచ్‌డీల ఆవశ్యకత, అంతర్జాతీయంగా వాటికి ఉన్న గుర్తింపును వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వృక్షశాస్త్రంలో ఉద్యోగ అవకాశాలపై అవగాహన

టెక్కలి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విద్యార్థులకు ఉద్యోగ, పరిశోధన అవకాశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. అసోం కేంద్ర విశ్వవిద్యాలయం క్యాంపస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ఎల్ రాజు ప్రపంచ వ్యాప్తంగా సైన్స్ రంగంలో వివిధ ఉద్యోగ, పరిశోధనా అంశాల్లో వస్తున్న మార్పులను వివరించారు. కార్యక్రమంలో బోటనీ అధ్యాపకుడు డి.వాసుబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి విరాళం

హిరమండలం,ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హిరమండలంలో సత్యసాయి బాబా నూతన మందిర నిర్మాణానికి స్థానిక ప్రేమసాయి వృద్ధాశ్రమ నివాసి కోరాడ నరసింహమూర్తి రూ.50 వేలు వితరణగా అందజే శారు. ఈ మొత్తాన్ని శుక్రవారం మందిర అధ్యక్షుడు అందవరపు అబ్బాయికి అందించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఎస్.సాయిబాబా, బి.సురేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించండి

జలుమూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలకు వచ్చే అర్జీలను పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో కె.అప్పలనాయుడు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ గ్రామసభల్లో రైతుల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా వీఆర్వోలు, సర్వేయర్లు పనిచేయాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపడుతున్న పనులు సత్వరమే పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ జన్ని రామారావు, మండల సర్వేయర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శిథిల భవనాన్ని తొలగించండి



నందిగాం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): దీనబంధుపురంలో శిథిలావస్థకి చేరిన పంచాయతీ భవనాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామం మధ్యలో ఉండడంతో ఎప్పుడు కూలిపోయి ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని స్థానికులు ఎం.మోహనరావు, ఎం.రంగారావు, పి.తిరుపతిరావు తదితరులు పేర్కొన్నారు. భవనం తొలగించాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేదని, ఇప్పటికైనా భవనాన్ని తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు.

28న జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

జలుమూరు (సారవకోట), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈనెల 28న మదనాపురం ప్రాథమిక పాఠశాలలో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని, వీటిని విజయవంతం చేయాలని ఎంఈవో ఎంవీ రమణ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పోటీలకు అర్హులన్నారు. 3, 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ప్రైమరీ స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులను క్విజ్ పోటీలకు పంపాలని కోరారు.

మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు

పాతపట్నం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ స్కూల్‌లో 2025-26లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేవీ రత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్షకు మార్చి 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు ప్రవేశ రుసుం రూ. 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతిభ ఆధారంగా ప్రవేశ పరీక్షలో మార్కుల ప్రాతిపదికన సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు.